ఉష్ణోగ్రత
గరిష్ఠం 41.9
కనిష్ఠం 21.4




సమస్యను వింటున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రజావాణికి 68 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యమివ్వాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 68 ఫిర్యాదులు అందగా, అందులో రెవెన్యూశాఖకు చెందినవి 27, ఇతర శాఖలకు చెందినవి 41 ఉన్నట్లు చెప్పారు. ఫిర్యాదులను వెంటనే పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరగాళ్లను కాపాడుతున్న మోదీ

- ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీస్తున్న ప్రధాని
- రాజ్యాంగానికి బీజేపీతో ముప్పు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సభలో మాట్లాడుతున్న నారాయణ

శంషాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మళ్లీ గెలవాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ అన్ని వ్యవస్థలను దెబ్బతీస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభల్లో భాగంగా ఎంఎంఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జ్యుడిషియరీలో కూడా మోదీ జోక్యం చేసుకొని తనకు అనుకూలమైన వారిని తెచ్చుకుంటున్నారన్నారు. అలాగే ఆర్థిక నేరగాళ్లను కాపాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగంలోని ఫెడరల్ వ్యవస్థను దెబ్బకొడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారన్నారు. రాజ్యాంగానికి ప్రధానితో ముప్పు ఉందన్నారు. అందుకోసమే 'మోదీ ఆటావో' అనే ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న రాష్ట్రాలకు సమృద్ధిగా నిధులు ఇస్తున్నారని, అనుకూలంగా లేనివాటిని గవర్నర్ వ్యవస్థ ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మూసీ ప్రక్షాళన చేసే బాధ్యతను భవన నిర్మాణ కార్మికులకు ఇస్తే మూడు నెలల్లోనే పూర్తి చేస్తారన్నారు. సభాధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసుఫ్, పాలమాకుల జంగయ్య, రవీంద్రచారి, నర్సింహ, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, దేవేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఎస్. శేఖర్‌రెడ్డి, కే.రామస్వామి, ఎన్. మల్లేష్, వెంకన్న, కే.నర్సింహారెడ్డి, డీ.ప్రసాద్, ఎన్.గిరి పాల్గొన్నారు.



సన్మానం

వనజాతరెడ్డిని సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

శంషాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పౌరసరఫరాల అధికారిగా బాధ్యతలు చేపట్టిన వనజాతరెడ్డిని సోమవారం రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కార్యవర్గం సన్మానించింది. కార్యక్రమంలో పి.లక్ష్మీనారాయణగౌడ్, శశిధర్‌రెడ్డి, సి.సత్తయ్య, కృష్ణగౌడ్, భానుగౌడ్, విజయసూర్య, సందీప్‌గౌడ్, సత్తార్, భాస్కర్‌రెడ్డి, సురేష్, వినయ్‌గౌడ్, రాజు, జకరం శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పడిపోయిన పప్పు సాగు!

ఏటేటా తగ్గుతున్న పంటల విస్తీర్ణం

- కరువైన ప్రభుత్వ ప్రోత్సాహం
- పెట్టుబడి ఎక్కువ.. దిగుబడి తక్కువ
- రైతులకు దక్కని గిట్టుబాటు ధర
- అక్కడక్కడా కంది పంట సాగు
- ఇతర రాష్ట్రాల నుంచి పప్పుల దిగుమతి

జిల్లాలో పప్పు ధాన్యాల సాగు పడిపోయింది. వ్యవసాయ శాఖ యాసంగిలో వరికి బదులుగా పప్పు ధాన్యాలను పండించాలని విస్తృత ప్రచారం చేస్తున్న ఈ పంటల సాగు విస్తీర్ణం పెరగడం లేదు. పెట్టుబడి పెరగడం, దిగుబడి రాకపోవడం, గిట్టుబాటు ధర దక్కకపోవడంతో ఈ పంటలను వేయడానికి రైతులు అనాసక్తి చూపుతున్నారు. వాణిజ్య పంటలతో పోల్చుకుంటే లాభాలు తక్కువగా ఉండటం, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటంతో పప్పు పంటల సాగు ఏటేటా తగ్గుతూ వస్తుంది. జనాభా అవసరాలకనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి పప్పు ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్య పంటలు సంప్రదాయ సాగును వెనక్కి నెట్టేస్తున్నాయి. ఎన్నోఏళ్లు స్థిరంగా ఉన్న పప్పు ధాన్యాల దిగుబడులు కొన్నేళ్లుగా క్షీణిస్తూ వస్తున్నాయి. జిల్లాలో వానాకాలం, యాసంగి పంటలను పరిశీలిస్తే పప్పుల సాగు గణనీయంగా పడిపోయింది. పెరుగుతున్న జనాభా అవసరాలకనుగుణంగా ఆహార ఉత్పత్తి పెరగడం లేదు. మాంసాహారంతో సంబంధం లేకుండా పోషకాలను అందించే పప్పు ధాన్యాల సాగు ఏటేటా తగ్గుతూ వస్తుంది. జిల్లాలో ఆహార ధాన్యాల ఉత్పత్తితో పోల్చుకుంటే పప్పుదినుసుల ఉత్పత్తి శాతం అతి తక్కువగా ఉంది. పప్పు దినుసుల సాగు కనిష్ఠస్థాయికి పడిపోవడంతో ఆహార భద్రతపై ప్రభావం చూపుతుందని

మిగతా 8వ పేజీలో...

ఒకప్పుడు అధికంగా సాగు చేసేవాళ్లం

ఒకప్పుడు మా పొలంలో కంది, శనగ, మినుములు, అనుములు, పెసర్లు సాగు చేసేవాళ్లం. ఇప్పుడు సాగు చేయడం లేదు. గతంలో సబ్సిడీపై విత్తనాలు ఇచ్చేవారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం పప్పు ధాన్యాలను కొనేవారు. ఈ పంటలకు దిగుబడి తక్కువగా వస్తుంది. పెట్టుబడులు కూడా పెరిగిపోయాయి. వాణిజ్య పంటలనే ఎక్కువగా సాగు చేస్తున్నాం. కొద్దిగా కంది పంట వేస్తున్నాం.



గోపాల్‌రెడ్డి, రైతు, మల్యాపూర్



సివిల్ జడ్జిని అభినందిస్తున్న న్యాయవాది కంచి రాజ్‌గోపాల్

సీనియర్ సివిల్ జడ్జికి ఘన వీడ్కోలు

స్వాతిరెడ్డి బాధ్యతల స్వీకరణ

షాద్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న రాజ్యలక్ష్మి నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నూతన సీనియర్ సివిల్ జడ్జిగా స్వాతిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం షాద్‌నగర్ కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిని న్యాయవాది కంచి రాజ్‌గోపాల్‌తో పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సీనియర్ సివిల్ జడ్జిగా ఆమె అందించిన సేవలను న్యాయవాదులు కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్లుగా.. ఎడతెగడంలే!

నేటికీ కొనసాగుతున్న డిగ్రీ కళాశాల భవన నిర్మాణం

- కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం
- ఆగి సాగుతున్న పనులు
- సొంత భవనం లేక అవస్థల్లో విద్యార్థులు
- ఈ సారైనా నూతన భవనంలోకి మారేనా..?

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నా నేటికీ పూర్తి కాలేదు. పనులు ఒక అడుగు ముందుకు.. ఒక అడుగు వెనక్కి అనే రీతిలో జరుగుతున్నాయి. సకాలంలో నిధులు మంజూరు కాకపోవడం, కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడం తదితర కారణాలతో ఏళ్ల తరబడి నిర్మాణం జరుగుతుండటంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడిప్పుడే పనులు చివరి దశకు చేరుకున్నాయి.

2016లో శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం పట్టణ సమీపంలోని వినోభానగర్‌లోని భూదాన్ భూముల్లో డిగ్రీ కళాశాల భవనానికి ఐదెకరాల స్థలం కేటాయించారు. 2016 డిసెంబర్‌లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇక్కడ నూతన భవన నిర్మాణానికి

మిగతా 8వ పేజీలో...



కొనసాగుతున్న ప్రహరీ పనులు

విద్యా వ్యవస్థపై చిన్నచూపు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను చిన్నచూపు చూసింది. కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తవడానికి ఎనిమిదేళ్లు పట్టింది. ఈ ప్రాంతంలో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువగా డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్నారు. భవన నిర్మాణం ఏడేళ్లుగా కొనసాగడం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి భవనం నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.



- సీహెచ్.బుగ్గరాములు, సీపీఎం మండల కార్యదర్శి



6

దేశ సమగ్రాభివృద్ధికి గ్రంథాలయాలు అవసరం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- షాద్‌నగర్‌లో నూతన లైబ్రరీ భవన ప్రారంభోత్సవం



6

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

భూ భారతితో సమస్యలకు చెక్

- కలెక్టర్ నారాయణరెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల సత్వర పరిష్కారంతో పాటు రైతుల మేలు కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ భారతి పేరుతో కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరంలోని కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాలులో ఈ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రైతులు ఇకపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఎంత పెద్ద సమస్య అయినా త్వరితగతిన పరిష్కారమయ్యేలా భూ భారతి చట్టం పని చేస్తుందన్నారు. గతంలో ఆర్ఓఆర్ అప్పీల్ చేసే అవకాశం ఉండేది కాదని, ఇప్పుడు భూ భారతి ద్వారా అమలవుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోనే తహసీల్దార్ విచారణ చేసి మ్యూటేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్, తహసీల్దార్ సైదులు, ఉప తహసీల్దార్ నవత, ఎంపీడీవో శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, వైస్ చైర్మన్ యాదయ్య, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, రఘుమారెడ్డి, కూన యాదయ్య, రఘుపతి, సుదర్శన్‌యాదవ్, కాకి ఈశ్వర్, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, అంద్యానాయక్, రాజునాయక్, ప్రశాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

ఈదురు గాలులకు విరిగిన చెట్లు, నేలకొరిగిన హోర్డింగ్‌లు

తడిసిన ధాన్యం, పిడుగుపాటుకు గేదె మృతి



కేశంపేటలో రోడ్డుపై విరిగిన పడిన చెట్టు



పెద్దమ్మతండాలో కూలిన మామిడి చెట్లను చూపుతున్న రైతు

రంగారెడ్డి అర్బన్/కందుకూరు/శంకర్‌పల్లి/కేశంపేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా పరిగిలో అత్యధికంగా 22.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి పిడుగు పడి గేదె మృతి చెందింది. దోమలో 20.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వర్షానికి రకొండ గ్రామంలో వరి ధాన్యం తడిసింది. పాలేపల్లి మధ్యలో చెట్లు విరిగాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పూడూర్ మండలం మన్నేగూడలో 13.5 మిల్లీమీటర్లు, బొంరాస్‌పేటలో 10.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది రంగారెడ్డి జిల్లా కేశంపేటలో 10.0 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. కందుకూరు మండలం పెద్దమ్మతండా, పులిమామిడి, ధన్నారం, జైత్వారం గ్రామాలలో భారీ ఈదురుగాలులతో మోస్తరు వర్షం కురిసింది. పెద్దమ్మతండాలో ఎస్ కృష్ణానాయక్‌కు చెందిన తొమ్మిదెకరాలలో మామిడి చెట్లు విరిగి, కాయలు నేల రాలాయి. శంకర్‌పల్లిలో ఈదురుగాలులతో వర్షం కురవడంతో ఎస్‌బీ సూపర్ మార్కెట్ పై ఉన్న భారీ హోర్డింగ్ పక్కకు ఒరిగింది. మున్సిపల్ కమిషనర్ యోగేష్ అక్కడికి చేరుకొని సాయికాలనీకి వెళ్లే దారిని మూసివేయించారు. కేశంపేట మండలంలోని అల్వాల, కొత్తపేట, కేశంపేట, వేముల్‌నర్వ, కాకునూర్, లేమామిడి, నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల, చింతకుంటపల్లి గ్రామాలలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. గాలుల ధాటికి కేశంపేట - కొత్తపేట రోడ్డులో చెర్లమైసమ్మ ఆలయం ఎదురుగా ఓ భారీ చెట్టు రోడ్డుకు అడ్డంగా విరిగి పడింది. ఆలయ సమీపంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది.

సభ్యత్వ నమోదులో టీడీపీ ఆదర్శం

ఆమనగల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో తెలుగు దేశం పార్టీ దేశంలోప్రాంతీయ పార్టీలకు ఆదర్శంగా నిలిచిందని టీడీపీ రాష్ట్ర నాయకుడు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యుడు, ఆమనగల్లు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ అన్నారు. టీడీపీ సభ్యత్వాన్ని పార్టీ శ్రేణులు గౌరవంగా భావించాలని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ సభ్యత్వ డిజిటల్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వనమోదులో టీడీపీ అన్ని రాజకీయ పార్టీలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. నాయకులు వజ్రలింగం, తిమ్మయ్య, సత్తయ్య కాలే శివ, జగన్, మహేశ్, నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రాభివృద్ధికి గ్రంథాలయాలు అవసరం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్/చౌదరిగూడ, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. షాద్‌నగర్‌లో రూ.75లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల్లో కాంపిటీషన్ పుస్తకాలతో పాటు, ఇతర పుస్తకాలను అందుబాటులోకి తీసుకవచ్చామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మన్ రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రాణి, గ్రంథపాలకుడు జీవీ శ్రీనివాస్ రాజు, షాద్‌నగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు అనితాశ్రీనివాస్‌గౌడ్, సోమ్లు నాయక్, వేణుగోపాల్, శివశంకర్‌గౌడ్, జెనిగె జగన్, జె.సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.కాగా కొందుర్గులోరూ.1.20లక్షలతో మంజూరైననూతన గ్రంథాలయనిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్, మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్మాణం కోసం స్థలదాత పెద్ది శ్రీనివాసులు మాట్లాడారు.

రూ.కోటిలో సీసీ రోడ్డు నిర్మాణం

కొత్తూర్‌లోని పెంజర్ల చౌరస్తా సమీపంలో గల బైపాస్ రహదారి సర్వీస్ రోడ్డు నుంచి కేజీబీవీ వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కమిషనర్ బాలాజీ, పబ్లిక్ హెల్త్ డీఈఈ సాధిక్, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్ సోమ్లునాయక్ పాల్గొన్నారు.



కొత్తూర్: గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వినతి

నందిగామ:మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు ఎమ్మెల్యేశంకర్‌తో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.మధుసూదన్‌రెడ్డి స్పందిస్తూ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.శివశంకర్‌గౌడ్, జంగ నర్సింహులు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

ఆమనగల్లు,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు అండగా ఉంటానని టాస్కీసీవోవో, ఐక్యతఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కొత్తకుంట తండా, పోలెపల్లిలో సోమవారం సుంకిరెడ్డి పర్యటించారు. పిడుగుపాటుకు నాలుగు మేకలు మృతి చెంది నష్టపోయిన కొత్తకుంటతండాకు చెందినకేతావత్‌శంకర్‌ను పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. పోలెపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన లాలయ్యను పరామర్శించి చికిత్సకు రూ.10 వేలు సాయమందించారు. కర్నాటి బుచ్చిరెడ్డి, రచ్చ శ్రీరాములు, నరేందర్‌గౌడ్, అభినవ్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఉమ్రా యాత్రికులకు ఘనస్వాగతం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న హైదరాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన వారు సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వారికి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. 15 రోజుల పాటు మక్కాలోని మదీనాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి హైదరాబాద్‌కు చేరుకోవడంతో కుటుంబ సభ్యులు పూలమాలలతో సన్మానించి స్వాగతం పలికారు. ఆల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ హాఫీజ్ మొహ్మద్ ఫయాజ్ అలీ తదితరులున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిమ్స్ వైద్యులు డాక్టర్ దివ్య తెలిపారు. జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌లో సోమవారం ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డాక్టర్ పూనమ్ సుతార్, పల్లె దవాఖాన వైద్యుడు జగదీష్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో అవార్డు రావడం అభినందనీయం

యాచారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మాల్ గ్రామపంచాయతీకి ఆత్మనిర్భర్ జాతీయస్థాయి అవార్డు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.నరేందర్ రెడ్డి, ఎంపీవో శ్రీలత, కార్యదర్శి వైపీ రాజులను సోమవారం ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సన్మానించారు. గ్రామాభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే వారిని అభినందించారు. మాజీ సర్పంచ్ కవితతో పాటు ప్రజాప్రతినిధులు అధికారులను అభినందించారు.



నరేందర్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం కూలి రేట్లు పెంచి ఇవ్వాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జె.అంజయ్య తెలిపారు. ఈమేరకు సోమవారం వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే చేవెళ్లలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 75లో ఉన్న నాలుగు ఎకరాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరారు. బానూరు సుబాన్‌రెడ్డి, ఎం.సువర్ణ, యశోద, యాదమ్మ, సువర్ణ, చంద్రమ్మ, ఎల్లమ్మ, తదితరులున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్

చేవెళ్ల, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ అన్నారు. సోమవారం చేవెళ్లలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించలేదని మండిపడ్డారు.ఈనెల 25,26,27న ఖమ్మంలో జరిగే 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు సమీర్, కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మహేశ్వరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌అన్నారు. సోమవారం మహేశ్వరంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడే వేడుకలను విజయవంతం చేయాలన్నారు. శేఖర్, కృష్ణ, నర్సింహ, రమేష్, సాగర్, అంజయ్య, శ్రీశైలం, యాదయ్య పాల్గొన్నారు.

నేడు ఇంద్రారెడ్డి వర్ధంతి

చేవెళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నేడు(మంగళవారం) మాజీ హోం మంత్రి, దివంగత ఇంద్రారెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ తెలిపారు. సోమవారం చేవెళ్లలో మీడియాతో మాట్లాడుతూ ఇంద్రారెడ్డి వర్ధంతిని కౌకుంట్లలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే సబితారెడ్డి, కుటుంబ సభ్యులు హాజరుకానున్నారని చెప్పారు.


తండాలో స్కూల్ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శిథిలావస్థలోని పాఠశాలల పరిశీలన

కోట్‌పల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను ఎంపీడీవో డేనియల్, ఎంఈవో చంద్రప్ప పరిశీలించారు. సోమవారం మోత్కుపల్లి, జిన్నారం, కంకణాలపల్లి, బార్వాద్‌తాండ, మద్గుల్‌తండాల్లో పాతబడి స్లాబ్ ఊడుతున్న పాఠశాలలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ జితేందర్. హెచ్ఎంలు రత్నకుమారి, విశ్వేశ్వర్, శారద, శ్రీనివాస్, అఖిల, శేఖర్, ప్రణయ్, శ్రీలక్ష్మి ఉన్నారు. అంతకుముందు కరీంపూర్‌లో నిర్మిస్తున్న కస్తూర్బాగాంధీ పాఠశాలను ఎంఈవో సందర్శించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఏఈ రాంకిషోర్‌కు సూచించారు.


హెచ్ఎంతో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో

బషీరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపీడీవో విజయ్‌కుమార్ సోమవారం సందర్శించారు. తరగతి గదులను చూశారు. హెచ్ఎం సాజీదాబేగం, టీచర్లతో సమస్యలపై చర్చించారు. గదుల పైకప్పు ఊడి పడేలా ఉందని, విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. గదుల రిపేర్ల కోసం నివేదిక పంపుతామని చెప్పారు.

బాలికల హాస్టల్ సందర్శన

బషీరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేశ్ సోమవారం సందర్శించారు. భవనం, గదుల పెయింటింగ్ పనులను పరిశీలించారు. వార్డెన్‌తో మాట్లాడారు. పనులు నాణ్యతగా చేయించాలని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


వార్డెన్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

యాలాల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంటనష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు, వడగండ్లకు మక్కలు, వరి, జొన్న పంటలు పాడయ్యాయని తెలిపారు. మామిడికాయలు రాలిపోయాయని పేర్కొన్నారు. పంటలు పాడవకుండా ఉండాలంటే ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రాలేర్పాటు చేయాలని కోరారు.


మల్కయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను పెడుతున్నామని పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. సోమవారం జోడిమెట్లలోగల పోచారం చౌరస్తాలో బద్దం కృష్ణారెడ్డి, బద్దం బుచ్చిరెడ్డి, బద్దం బుచ్చమ్మ, బద్దం నర్సింహారెడ్డిల జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బాటసారులు, వాహనదారులకు ఎండలో దాహాన్ని తీర్చేలా దీనిని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బి.సత్తిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం, కార్తీక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామ్మోహన్‌రావు, సీఐటీయూ నాయకులు

బీజేపీవి కార్మిక వ్యతిరేక విధానాలు

తలకొండపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామ్మోహన్‌రావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లను, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తలకొండపల్లి మండల సీఐటీయూ సమావేశం సోమవారం మండల కేంద్రంలో ఏరియా కమిటీ అధ్యక్షుడు పెంటయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి రామ్మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్‌కార్యాచరణ రూపొందించారు. మే 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మె, మేడే వేడుకల విజయవంతంపై చర్చించారు. రామ్మోహన్ రావు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు ఉద్యమాలు చేసి 8 గంటల పనిదినాలు సాధించుకుంటే మోదీ సర్కార్ అందుకు విరుద్ధంగా చట్టాలు తీసుకువస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టేందుకు కార్మికులు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ప్రేమలత, రమాదేవి, లక్ష్మయ్య, రమేశ్, జంగయ్య, యాదమ్మ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

24న అనంతగిరి ఆలయ భూముల వేలం

వికారాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అనంతపద్మనాభ స్వామి ఆలయం, అనంతగిరి పరిధి పొలాలను 3సంవత్సరాల కౌలు కోసం వేలాన్ని ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తామని ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్ సోమవారం తెలిపారు. 24న ఉదయం 11గంటలకు వికారాబాద్, పూడూరు, ధారూరు మండలాల్లోని భూములు, 25న పరిగి, దోమ మండలాల్లోని భూములను వేలాన్ని అనంతగిరి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. పాల్గొనదల్చిన రైతులు రూ.2వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని వారు కోరారు.

నేటి నుంచి భూ భారతి అవగాహన సదస్సులు

తాండూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ భారతి చట్టం 2025పై ప్రజలకు, రైతులకు తాండూరు నియోజకవర్గంలో ఈ నెల 22 నుంచి అవగాహన సదస్సులకు నిర్ణయించారు. 22న తాండూరు,బషీరాబాద్ మండలంలో, 28న యాలాల, పెద్దేముల్ మండలాల్లోని రైతు వేదికల వద్ద సమావేశాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని చట్టంపై అవగాహన పొందాలని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు.

ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి


ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదులను పెండింగ్ పెట్టకుండా వెంటవెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించి 140 ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యల ఫిర్యాదులను రెవెన్యూ అధికారులకు పంపి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

27న మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 27న పరీక్ష నిర్వహించనున్నట్లు నేదునూరు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 7 నుంచి 10వ తరగతుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. నేటి నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష రాయనున్న విద్యార్థులు పరీక్ష సమయానికి 45నిమిషాల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. మార్చి 20 వరకు దరఖాస్తు చేసుకున్నవారు మాత్రమే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.


కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

చెన్‌గోముల్ సంతను పునరుద్ధరించాలి

పూడూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో వారాంతపు సంతను పునరుద్ధరించాలని చెన్‌గోముల్ వాసులు పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో మాదిరిగానే సంతకు అనుమతివ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాజు, బాలయ్య, కిష్టయ్య, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం

లెక్క తేలని ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ.. వార్డు ఆఫీసర్ల కుంటిసాకులు



వికారాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్ర భుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక గందరగోళంగా మారుతంది. వికారాబాద్ మునిసిపాలిటీలో 34వార్డులుండగా మొదటి లిస్టులో 1,489 మందిని ప్రకటించారు. అయితే చా టలా మంది అర్హుల పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలన సభల్లో పేదల నుంచి ద రఖాస్తులను స్వీకరించారు. పట్టణంలో 15వేలకుపైగా ఇళ్ల కోసం అప్లికేషన్ పెట్టారు. బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. లబ్ధిదారుల కేటగిరీ ప్రకారం 13,111మందిని అర్హులుగా ఎంపిక చేయగా మొదటి లిస్టులో 1,489 మందినే ప్రకటించడంతో చాలా మంది నిరుత్సాహానికి గురయ్యారు.

చేతులెత్తేస్తున్న అధికారులు

ఈ విషయమై పేదలు అధికారులను ప్రశ్నిస్తే.. అది తమకు తెలియదని, అప్పట్లో ఎంక్వైరీ చేసి లిస్టు ఫైనల్ చేశారని చెబుతున్నారు. బిల్‌కలెక్టర్ల పరిశీలనానంతరమే లిస్ట్ ఆన్‌లైన్లో నమోదు చేసిన ట్టు పేర్కొంనటున్నారు. ఇళ్లున్న వారికి, గతంలో గృహరుణం పొందిన వారికే మళ్లా ఇందిరమ్మ ఇం డ్లు కేటాయించారని పేదలు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడితో వారికి ఇష్టం ఉన్న వారికే ఇం డ్లు మంజూరు చేశారంటున్నారు. అధికారులు మ రోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్లు పేదలకే ఇండ్లు మంజూరు చేసి వెంటనే గ్రౌండింగ్ చేయాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు.

ఆన్‌లైన్ విధానంలోనే ఎంపిక



ఇందిరమ్మ ఇండ్ల పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే చేపట్టాం. నాయకులకుగానీ, అధికారులకుగానీ ప్రమేయం లేదు. మొదటి లిస్టులో 1,489 మంది పేర్లు ఉన్నాయి. వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. అనర్హులుంటే పేరు కట్ చేస్తాం. ఇండ్ల ఎంపికలో ఎవరి ప్రమేయమూ ఉండదు.

- జకీర్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

అనుమతుల్లేని నిర్మాణాలపై

ఉక్కుపాదం

కొత్తూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని స్థానిక మున్సిపల్ కమిషనర్ బాలాజీ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని పారిశ్రామికవాడ శివారులో అనుమతులు లేకుండా కొందరు గోదాంల నిర్మాణాలు చేపట్టారని, వారికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. అలాగే ఫాంహౌజ్‌లలో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో వారికి కూడా నోటీసులు అందజేస్తామన్నారు. నోటీసులకు స్పందించకపోతే నిర్మాణాలను కూల్చివేయిస్తామన్నారు. నూతనంగా ఇల్లు నిర్మించేవారు మున్సిపాలిటీ అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు. కాగా, పరిశ్రమలు, గోదాంలకు మున్సిపల్ ట్యాక్స్‌లు తక్కువగా నిర్ణయించారని, గృహాలకు మాత్రం అధికంగా నిర్ణయిస్తున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు కమిషనర్ స్పందిస్తూ రివిజనల్ మార్పులు, చేర్పులు చేస్తామని తెలిపారు.

తైబజార్‌కు బ్రేక్!

- టెండర్ రద్దుపై తలలుపట్టుకుంటున్న అధికారులు
- ఎమ్మెల్యే నిర్ణయంతో రైతులు, వ్యాపారుల హర్షం


తాండూరు మునిసిపల్ కార్యాలయం

తాండూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ అధికారులు వక్రమార్గంలో ఖజానా నింపుకునేందుకు ప్రజలపై పన్నుల భారం వేస్తున్నారు. కార్యాలయంలో ఏసీలు, అధికారులకు వాహనాలంటూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. రూ.43లక్షలతో ఏసీలు, కార్పొరేట్ తరహాలో క్యాబిన్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే రోడ్లపై పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పూలు తదితర చిరు వ్యాపారులు, రైతులపై తైబజార్ భారం మోపుతున్నారు. మున్సిపాలిటీ నిధులు దుబారా చేసి రైతులు, చిరువ్యాపారులపై భారం వేసే ప్రయత్నాలు చేశారు. తై బజార్‌కు ఈ నెల 4న టెండర్లు వేశారు. రైతులు, చిరు వ్యాపారులు రోజూ వారు ఆక్రమించే స్థలాన్ని బట్టి రూ.50 నుంచి 100 వసూళ్లకు ప్రణాళిక వేశారు. ఈ ఫీజుపై రైతులు, చిరు వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వారు ఏకంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మొరపెట్టుకోగా తై బజార్‌ను రద్దు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. నిజానికి తాండూరులో 11ఏళ్ల తైబజార్ విధానాన్ని ఎత్తేశారు. ఇప్పుడు కొత్తగా తైబజార్‌కు ఎమ్మెల్యేకు చెప్పకుండా ప్రత్యేకాధికారి నుంచి అప్రూవల్ తీసుకొని టెండర్ ఓకే చేశారు. కాంట్రాక్టర్ రూ.10.21లక్షలకు వేలాన్ని దక్కించుకున్నాడు. రైతులు, వ్యాపారుల వ్యతిరేకించారు. దీంతో టెండర్ కోసం తీసుకున్న డిపాజిట్లు వాపస్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అయితే టెండర్ రద్దు చేస్తే ఏమైనా న్యాయపర చిక్కులొస్తాయా అని అధికారులు తలపట్టుకుంటున్నారు. ప్రస్తుతమైతే తైబజార్ వసూలు చేయడం లేదు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే నిర్ణయంతో చిరువ్యాపారులు, రైతులు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కుంటను పూడ్చేస్తున్నారు!

- రాళ్లు, మట్టితో నింపుతున్న రియల్‌వ్యాపారులు
- మూడెకరాల భూమి కబ్జాకు యత్నం
- ఇక్కడ ఎకరం రూ.ఏడు కోట్ల పైమాటే
- భారీ షెడ్డు వేసేందుకు ముమ్మర ప్రయత్నాలు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు


గోధుమకుంట చెరువును పూడ్చుతున్న కబ్జాదారులు

కీసర, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): తమ స్వలాభాం కోసం పలువురు రియల్ వ్యాపారులు కుంటను పూడ్చేస్తున్నారు. దాదాపు 3 ఎకరాలలో ఉన్న కుంటను బండరాళ్లు, మట్టి పోసి మాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పట్టపగలే దర్జాగా పూడుస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని గోధుమకుంట గ్రామంలో సర్వే నంబర్ 38లో 3 ఎకరాలలో ఈ కుంట విస్తరించి ఉంది. అక్కడ ఎకరం సుమారు రూ.7- రూ.8 కోట్లు పలుకుతోంది. దీంతో ఆ వ్యాపారుల కన్ను గోధుమకుంటపై పడిది. దీంతో తమ పట్టా భూమికి ఆనుకొని ఉన్న ఈ కుంటను పూడ్చుందుకు రంగం సిద్ధంగా చేశారు. ఈ మేరకు పగలురేయి తేడా లేకుండా బండరాళ్లు, మట్టితో పూడ్చేస్తున్నారు.

పట్టించుకోని స్థానికులు

గతంలో పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామం ఇప్పుడు నాగారం మున్సిపాలిటీలో విలీనమైంది. దీంతో తాము చేసే పనికి అడ్డంకులు తొలగాయి అనుకొని రియల్ వ్యాపారులు కోట్ల విలువైన భూమి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. మూగ జీవాల దాహార్తిని తీర్చే ఈ కుంటను కబ్జా చేస్తున్నా స్థానిక నాయకులు, గ్రామస్తులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో మాజీ సర్పంచ్ దగ్గర ఆ కుంట పక్కనే ఉన్న భూమిని కొనుగోలు చేసినట్లు, కుంట కూడా అందులో భాగమే అన్నట్లు మాయమాటలు చెప్పి కుంటను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కుంటపై అవగాహన ఉన్న వ్యక్తులను మచ్చిక చేసుకొని వారికి చేతులు తడుపుతూ, తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ అంశంపై ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోధుమకుంటను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

అర్హులకు అందని ఇందిరమ్మ ఇళ్లు

చౌదరిగూడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు అందడం లేదని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్యదర్శులు, అధికారులు గ్రామాల్లో తిరగకుండా కొంతమంది ప్రవేట్ వ్యక్తులతో సర్వే నిర్వహించి నిజమైన అర్హులను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి దూరం చేశారని మండిపడ్డారు. అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో సర్వే నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ నాయకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న కేంద్రం'

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపర్చుతూ దేశ ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం రాజ్యాంగ పరిరక్షణ కోసం చేపట్టిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మల్కారం, రామంజపూర్, రామంజపూర్ తండా, బోటిగూడ గ్రామంలో పర్యటించారు. మండల ఉపాధ్యక్షుడు రమేశ్, బంగారం కుమార్, అశోక్, రఫీక్, సలీమ్, బాబన్న, జైపాల్‌రెడ్డి, నజీర్, తాజ్, శ్రీరాములు, గణేశ్‌యాదవ్, లింగం, రవి, తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసం మంత్రికి కృష్ణానాయక్ వినతి

ఆమనగల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కృష్ణానాయక్ సోమవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏఐసీసీ దేశవ్యాప్తంగా ఆదివాసీ నాయకత్వాన్ని పెంపొందించడం కోసం జిల్లాల వారిగా ఆదివాసీ ట్రైబల్ ట్రేడింగ్ క్యాంపులు నిర్వహిస్తోంది. అందులో భాగంగా వరంగల్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న కృష్ణానాయక్ మంత్రి సీతక్కను, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో తండాలలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి ప్రత్యేక నిధుల కేటాయింపు గూర్చి కోరగా సానుకూలంగా స్పందించినట్లు కృష్ణనాయక్ తెలిపారు.


లక్ష్మారెడ్డి నివాసంలోకి వెళ్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

మారం విజయను పరామర్శించిన

ఎమ్మెల్సీ కోదండరాం

ఘట్‌కేసర్. ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి రాష్ట్ర నాయకుడు మారం లక్ష్మారెడ్డి సతీమణిని ఎమ్మెల్సీ కోదండరాం పరామర్శించారు. సోమవారం ఘట్‌కేసర్‌లోని లక్ష్మారెడ్డి నివాసానికి వచ్చిన ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న విజయను పరామర్శించి ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.


కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

ఆదిభట్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికుల సమస్యలు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మే 20న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు నర్సింహ కోరారు. ఈమేరకు కార్మికులతో కలిసి ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పనికి తగిన వేతనం అమలు చేయాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్మికులు మల్లారెడ్డి, మల్లికార్జున్, గణేష్, జయ, సదానంద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా సదుపాయం అభినందనీయం

యాచారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న వారికి అంకిత ఎన్‌జీవో సంస్థ బీమా సదుపాయం కల్పించేందుకు ముందుకురావడం అభినందనీయమని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు సోమవారం చౌదర్‌పల్లితో పాటు చిన్నతూండ్ల గ్రామాలకు చెందిన కూలీలకు ఈస్టన్ గవర్నమెంట్ ఇన్సూరెన్స్ కింద రూ. రెండు లక్షల బీమా పత్రాలు ఎంపీడీవో అందించారు. ఏపీవో లింగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య, అంకిత సంస్థ ప్రతినిధి బ్రహ్మం తదితరులున్నారు.


జేఈఈ మెయిన్స్ ఆలిండియా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను నారాయణ బొంగులూరు బ్రాంచ్ కళాశాల సిబ్బంది సన్మానించింది. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ డివిజనల్ డీన్ రామలింగారెడ్డి, కోర్ డీన్ పి.శ్రీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఏజీఎం ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై ప్రధాన దృష్టి



ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ గురునాయుడు

ఫొటో ఫీచర్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పీఎస్ పరిధి తుర్కయాంజాల్ నుంచి మాల్ వరకు ఉంది. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్క్ చేయడాన్ని వీలైనంతమేర తగ్గించి ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.గురునాయుడు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న : రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : ముఖ్యంగా రాష్ డ్రైవింగ్ పట్ల ఫోకస్ చేస్తున్నాం. తాగి వాహనాలు నడిపితే డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకు 300 కేసులు నమోదు చేశాం. రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయకుండా ఒక సిస్టం తీసుకొస్తున్నాం.

ప్రశ్న : ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఇబ్బందిగా ఉందా?

జవాబు : విద్యార్థులు కళాశాలలకు వచ్చివెళ్లే సమయాల్లో ఇబ్రహీంపట్నం చౌరస్తా, బస్టాండు, మంగల్‌పల్లి, బొంగులూరు, తుర్కయాంజాల్‌లలో ఆటంకం కలగకుండా తమ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.

ప్రశ్న : ఇబ్రహీంపట్నం చౌరస్తాలో ఓ సర్కిలంటూ లేకపోవడంతో సమస్యలకు కారణమని చెప్పవచ్చా?

జవాబు : ఇక్కడ చౌరస్తా వద్ద ఐదు రోడ్లు ఉన్నాయి. సర్కిల్ సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ఏ వాహనం ఎటుపోతుందో తెలియని పిరిస్థితి. సిగ్నల్ ఏర్పాటు చేయడానికి ఇటీవలే అధికారులు పరిశీలన చే శారు. టెక్నికల్‌గా ఏర్పాటుకు ఆర్అండ్‌బీ అధికారులను సంప్రదిస్తున్నాం.

ప్రశ్న: సాగర్ హైవేపై వేగ నియంత్రణకు ఎటాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు : హైవేపై గున్‌గల్, ఆగాపల్లి, గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద, ఉప్పరిగూడ క్రాసింగ్, శేరిగూడ, మన్నెగూడల వద్ద బొల్లార్డ్ ఏర్పాటు చేశాం. అతివేగంపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : ఇబ్రహీంపట్నం టౌన్‌లో ప్రధాన రోడ్లపై ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లకు కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా లేదు. మీరేమంటారు?

జవాబు : వాస్తవమే. చాలావరకు షాపింగ్ కాంప్లెక్స్‌లకు పార్కింగ్ లేకపోవడంతో వాహనాలు రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఈ విషయంలో షాపుల యజమానులకు సూచనలు చేశాం. దుకాణాల ముందు వాహనాలు నిలిపితే వారినే బాధ్యులను చేయాల్సి వస్తుందని చెబుతున్నాం.

ప్రశ్న : వాహనదారులకు ఎలాంటి సలహాలు ఇస్తున్నారు?

జవాబు : వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండేట్లు చూసుకోవాలి. లైసెన్స్ అవసరమైన పత్రాలు, నెంబర్‌ప్లేట్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి. ట్రిపుల్ రైడింగ్‌పై నిరంతరం ఫోకస్ చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తున్నాం.

పడిపోయిన 'పప్పు' సాగు!

(5వ పేజీ తరువాయి)

నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే వానాకాలం సీజన్‌లో పప్పుదినుసుల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

పప్పుదినుసుల పంటల వివరాలు

యాసంగి(ఎకరాల్లో)

పంట	2020-21	2021-22	2022-23	2023-24
శనగలు	6596	7179	4373	1484
పెసర	4604.10	80	03	10
మినుములు	137	10	34	23
ఉలవలు	33.36	41	89	0

వానాకాలం(ఎకరాల్లో)

పంట	2020-21	2021-22	2022-23	2023-24
పెసర	518.37	24	53	48
కందులు	69808.21	3203	12077	11548
మినుములు	140.05	0	35	34

ఏటేటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం

వ్యవసాయ శాఖ యాసంగిలో వరికి బదులుగా పప్పు దినుసుల్ని పండించాలని విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నా సాగు విస్తీర్ణం పెరగడం లేదు. జిల్లాలో ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడం, దిగుబడి తగ్గడం, బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడం, మార్కెటింగ్ కల్పించకపోవడం తదితర కారణాల వల్ల పప్పు పంటల సాగు ఏటా గణనీయంగా పడిపోతుంది. గత నాలుగేళ్లలో పప్పుదినుసుల సాగును పరిశీలిస్తే ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. చలి కాలంలో పండే శనగను పరిశీలిస్తే.. మూడేళ్ల క్రితం 7,179 ఎకరాల్లో సాగు కాగా, 2023-24 వచ్చేసరికి 1,484 ఎకరాలకు చేరుకుంది. గరిష్ఠంగా 5,295 ఎకరాలకు శనగ సాగు పడిపోయింది. వానాకాలం, యాసంగిలో వేసే పెసర్ల పరిస్థితి మరి దారుణంగా మారింది. 2020-21 యాసంగిలో 4,604 ఎకరాల్లో సాగు చేశారు. 2023-24 సంవత్సరానికి వచ్చేసరికి కేవలం పదెకరాల్లోకి చేరింది. వానాకాలంలో సాగు చేసిన పెసర్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 2020-21 వానాకాలంలో 518 ఎకరాల్లో పెసర సాగు కాగా.. 2023-24 సంవత్సరంలో 48 ఎకరాలకు చేరింది. మినుములు, ఉలవ సాగు గణనీయంగా పడిపోయింది. ఒకప్పుడు ఎక్కడ చూసినా కంది పంట కనిపించేది. 69 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగైన ఈ పంట గతేడాది 11 వేల ఎకరాలకు చేరింది. గతంలో రాయితీపై విత్తనాలు అందేవి. కానీ ప్రస్తుతం రైతులు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఎరువులు, పురుగు మందులు సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఎకరానికి పెట్టుబడి ఖర్చు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు పెరిగినా గిట్టుబాటు ధర దక్కడం లేదు. పంట పెట్టుబడి పెరిగి, దిగుబడి తగ్గి, గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు పప్పు దినుసుల సాగుపై ఆసక్తి చూపడం లేదు. పత్తి, మిరప, పొద్దు తిరుగుడు తదితర వాణిజ్య పంటల వైపు రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

పప్పులను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి

గతంలో జిల్లాలో కంది, శనగ, మినుములు, పెసర తదితర పప్పు దినుసుల విరివిగా పండించేవారు. ఇప్పుడు సాగు చేస్తున్న పంట జనాభా అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి పప్పులను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంది మినహా మినుములు, పెసర, శనగ పంటలు సాగు సమయం తక్కువే. పెట్టుబడులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. కానీ వాణిజ్య పంటలతో పోల్చుకుంటే రైతులకు లాభాలు తక్కువగా వస్తుండటంతో పప్పు దినుసుల సాగు వైపు మొగ్గుచూపడం లేదు. ఏటా జిల్లాలో వీటి సాగు తగ్గిపోవడంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ పరంగా పంటకు ప్రోత్సాహకాలు అందిస్తేనే పప్పు దినుసుల సాగు పెరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఆహార భద్రత కోసం తీసుకువచ్చిన హరిత విప్లవం కూడా వ్యవసాయ విధానంలో భాగమైన పప్పు దినుసులను దూరం చేసింది. ప్రభుత్వం పప్పుదినుసుల ఉత్పత్తిని పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రాబోయే వానాకాలం సీజన్‌లో పప్పుదినుసుల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు.



రోడ్డుపై అడ్డంగా మర్రి చెట్టు పడిపోవడంతో నిలిచిన వాహనాలు

హైవేపై కూలిన భారీ మర్రిచెట్టు

- రోడ్డుపై రెండువైపులా నిలిచిపోయిన వాహనాలు
- తప్పిన పెను ప్రమాదం.. తొలగించాలని స్థానికుల డిమాండ్

చేవెళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న మర్రిచెట్టు రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో వాహనాలు లేకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదు. కాగా, వారంరోజుల క్రితమే మండల పరిధిలోని మీర్జాగూడ గేట్ సమీపంలో భారీ మర్రి చెట్టు పడిపోయింది. సోమవారం ఆలూర్ గేట్ సమీపంలో మరో భారీ చెట్టు రోడ్డుపై పడిపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులు వీచడంతో మండల పరిధిలోని ఆలూర్-అంతారం స్టేజీల మధ్యలో జాతీయ రహదారిపై భారీ మర్రి చెట్టు పడిపోయింది. గమనించిన వాహనదారులు, స్థానికులు పోలీస్‌లకు సమచారం అందించారు. ఈక్రమంలో రెండువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు అరగంట పాటు చేవెళ్ల సివిల్, ట్రాఫిక్ పోలీస్‌లు స్పందించి జేసీబీతో చెట్టును తొలగించారు. ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న మర్రి చెట్లను వెంటనే తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా ధర్నా



ఆమనగల్లు : ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, మారణహోమాన్ని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో సోమవారం పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ, బీజేవైఎం, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాషాయ జెండాలు చేబూని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనుల ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ చెన్నకేశవులుకు మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ గోరటి నర్సింహులు నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ, బీజేవైఎమ్, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, హిందు సంఘాల నాయకులు కృష్ణ యాదవ్, శ్రీకాంత్‌సింగ్, సుందూరు శేఖర్, కృష్ణనాయక్, చెన్నకేశవులు, రవిరాథోడ్, పద్మ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుకు ఆర్థిక సాయం



సత్యనారాయణకు నగదు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేశంపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామస్తుడు బద్క సత్యనారాయణకు చెందిన పాడి ఆవు ఆదివారం పిడుగుపాటుకు మృతిచెందింది. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ తన అనుచరులతో రూ.5వేలు పంపించారు. అలాగే కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డితో పాటు మరికొందరు బాధిత రైతుకు ఆర్థిక సాయం అందించారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పంపించిన నగదును సోమవారం ప్యాక్స్ డైరెక్టర్ పల్లాటి కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు బద్క వెంకటయ్య, తోట వెంకటేష్, గుత్తి రంగయ్య, మల్లయ్య, నిరంజన్, రాములు, నాగరాజు, చెన్నయ్యలు పాడి రైతుకు అందించారు.

ఎనిమిదేళ్లుగా.. ఎడతెగడంలె!



నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. మొదట్లో పనులు చకచకా సాగాయి. కాంట్రాక్టరుకు బిల్లులు సకాలంలో అందకపోవడంతో కొన్నిరోజులు పనులు నిలిచిపోయాయి. రెండేళ్ల క్రితం ఓ విడత నిధులు విడుదల చేయడంతో తిరిగి పనులు ప్రారంభించారు. భవనం నిర్మాణం పూర్తిచేసి.. కిటికీలు, డోర్లు బిగించి కలరింగ్ పనులు పూర్తిచేశారు. ఈ పనులు చేసిన కాంట్రాక్టరుకు ఇంకా కోటి రూపాయల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా రూ.40 లక్షలతో ఎలక్ట్రిక్, ప్లంబింగ్ పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఆ పనులు పూర్తి కావొస్తున్నాయి. ఈ కాంట్రాక్టర్‌కూ బిల్లు పెండింగ్‌లోనే ఉంది.

మూడో కాంట్రాక్టరుతో ప్రహరీ పనులు

కళాశాల ఎదుట ప్రహరీ నిర్మాణం, గేటు బిగింపు తోపాటు మూడు వైపులా చుట్టూ కంచె ఏర్పాటు పనులు రూ.30లక్షలతో మూడో కాంట్రాక్టరుకు అప్పగించారు. ప్రహరీ పనులు కొనసాగుతున్నాయి. ఇంకా ఇనుప కంచె ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇవిగాక ఫర్నిచర్‌కు రూ.50లక్షల నిధులు కావాల్సి ఉంది. జూలై ఒకటి నుంచి డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది కొత్త భవనంలోనే తరగతులు నిర్వహించాలనే యోచనలో అధికారులు ఉన్నారు. అయితే మొదటి ఇద్దరి కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వారు భవనాన్ని అప్పగించడం అనుమానంగా ఉంది. పనులు త్వరగా పూర్తి చేసి ఈ ఏడాదైనా నూతన భవనంలో చదువులు సాగేలా చూడాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

అరకొర వసతుల మధ్య తరగతులు

2008 నుంచి డిగ్రీ తరగతులు ఇబ్రహీంపట్నం టౌన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో షిఫ్టు పద్ధతిలో జరుగుతున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇంటర్ తరగతులు జరుగుతున్నాయి. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు డిగ్రీ తరగతులు నడుస్తున్నాయి. దీంతో ఉదయం పూట గ్రామాల్లో నుంచి సకాలంలో తరగతులకు హాజరుకాలేక ఇటు ఇంటర్ విద్యార్థులు, మధ్యాహ్నం తరగతులతో డిగ్రీ విద్యార్థులు నష్టపోతున్నారు. ఇక్కడ డిగ్రీలో 570 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. డిగ్రీలో రెగ్యులర్ కోర్సులతోపాటు బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో క్రాప్ ప్రొడక్షన్, డైరీ సైన్స్ లాంటివి కొత్త కోర్సులు నడుస్తున్నాయి. చాలీచాలని గదుల్లో డిగ్రీ తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ల్యాబ్‌లు, లైబ్రరీకి గదులు లేక ఒకేగదిలో రెండిటిని నిర్వహిస్తున్నారు. స్టాఫ్‌రూం కూడా లేక అధ్యాపకులు అవస్థ పడుతున్నారు. దాంతో పాటు పరీక్షల నిర్వహణ కూడా కష్టంగా మారింది.

ఇబ్బందుల మధ్యే చదువులు



డిగ్రీ కళాశాలకు ప్రత్యేక భవనం లేక ఇబ్బంది పడుతున్నాం. ల్యాబ్‌ల నిర్వహణకు కష్టంగా ఉంది. సరిపడా తరగతి గదులు, కనీస వసతులు లేవు. ఆటస్థలం కూడా లేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా కొత్త భవనంలోకి మారుతామనే ఆశతో ఉన్నాం.

- వెంకటసాయి,
డెయిరీ సైన్స్ డిగ్రీ మొదటి సంవత్సరం

ముమ్మరంగా సర్వే పనులు



నానక్‌నగర్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

యాచారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమి సర్వే పను లు జోరుగా సాగుతున్నాయి. సోమవారం పది మంది సర్వేయర్లు మూడు కిలోమీటర్ల మే ర సర్వే చేశారు. రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు సర్వే చేస్తుండగా కూలీలు హద్దులు గుర్తించిన చోట ఇనుపరాడ్లు బిగింపు పనులు చేస్తున్నారు. గుట్టల్లో జేసీబీ సాయంతో రంధ్రాలు చేసి ఇనుపరాడ్లు నాటుతున్నారు. అడవిలో పనులు చేస్తుండగా పోలీసులు రక్షణగా నిలిచారు. ఈ సందర్భంగా సర్వే తీరును హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు పర్యవేక్షించారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

యాచారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదని, అఘోరీపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం మండల మాలమహానాడు నాయకులు గోపాల్, యాదగిరి తదితరులు అన్నారు. ఈమేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ యాచారం ఎస్ఐ మధుకు ఫిర్యాదు చేశారు. అఘోరీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. నాయకులు నాగటి లక్ష్మణ్, మండలి గోపాల్, ధనుంజయ్ తదితరులున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థుల ఔదార్యం

- ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు

కేశంపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న అక్కాచెల్లెళ్లు ఔదార్యం చాటుకున్నారు. మారుమూల ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. వారిని సీఐ నరహరి అభినందించారు. నగరంలోని కూకట్‌పల్లికి చెందిన చలసాని ప్రతీక, హన్సికలు అకాచెల్లెళ్లు. వీరు బీటెక్ చదువుతున్నారు. కేశంపేట మండలం నిర్దవెల్లి జడ్పీహెచ్ఎస్‌లో తాగునీటికి ఇబ్బంది పడుతున్న విషయం ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డిల ద్వారా తెలుసుకున్నారు. కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.50వేలు ఖర్చుచేసి పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటుచేశారు. సోమవారం సీఐ నరహరితో కలిసి వారు ప్రారంభించారు. ఉపాధ్యాయులు ఆ యువతులకు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు, హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులున్నారు.



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న కేశంపేట సీఐ నరహరి

గులాబీ జెండా.. తెలంగాణకు అండ

ఆమనగల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గులాబీ జెండా.. తెలంగాణకు కొండంత అండ అని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ అద్భుతంగా అభివృద్ధి చేస్తే అబద్ధాల పునాదుల మీద నిర్మితమైన కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల్లో ఆగం చేసి మళ్లీ పూర్వస్థితికి తెచ్చిందని ఆరోపించారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి, శెట్టిపల్లి, ఆకుతోట పల్లి, మేడిగడ్డ, కోనాపూర్, రాంనుంతల తదితర గ్రామాల్లో అర్జున్‌రావు పర్యటించారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ విజయవంతంపై పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. సభకు కరపత్రాలు, పోస్టర్లను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. దోనాదుల కుమార్, పంతూనాయక్, శ్రీను నాయక్, దోనాదుల సత్యం, పరమేశ్, కేశవులు, వెంకటేశ్, కుమార్, లక్ష్మణ్ నాయక్, ప్రశాంత్‌నాయక్, వెంకటయ్య,జంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ సభవిజయవంతంపై మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. నిరంజన్‌గౌడ్, గుత్తి బాలస్వామి, సయ్యద్ ఖలీల్, సైదులుగౌడ్, తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు : పోస్టర్ ఆవిష్కరిస్తున్న అర్జున్‌రావు



కందుకూరు : పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రజతోత్సవ సభకు తరలిరావాలి

కందుకూరు : ఈనెల 27న వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కందుకూరు మండలం నుంచి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశాను సారం రజతోత్సవ సభకు మండలం నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, ఆనంద్, పిట్టల పాండు, నర్సింహ, సామ ప్రకాశ్‌రెడ్డి, అనేగౌని దామోదర్‌గౌడ్, ఇందిరదేవేందర్, తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, జ్యోతిచంద్రశేఖర్, సరళజంగయ్య, ఆర్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పట్టని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

యాచారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, చాలాచోట్ల శిథిలమైన భవనాలలో బోధన సాగుతోందని, కొన్నిచోట్ల ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం యాచారంలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు. సర్కార్ విధానాల కారణంగానే ప్రభుత్వ బడులకు పిల్లలను పంపడానికి పేదలు జంకుతున్నారన్నారు. చాలాచోట్ల శిథిలమైన భవనాలున్నా.. కొత్త భవనాలు ఎందుకు కట్టించడం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా అజయ్‌గౌడ్, విప్లవ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా భాస్కర్, ప్రేమ్‌కుమార్, రోహిత్, సహాయ కార్యదర్శులుగా తరుణ్, రమేష్‌లను ఎన్నుకున్నారు.

సంక్షిప్తంగా..

మాడ్గుల : సోనియా, రాహుల్ గాంధీలపై ఈడీ అక్రమ కేసులు దాఖలు చేసి చార్జిషీట్ వేయడాన్ని ఖండిస్తూ బ్రాహ్మణపల్లిలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహమ్మద్ బాబా మండిపడ్డారు. ఈమేరకు ఆయన మోదీ, అమిత్‌షాల దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ సోనియా, రాహుల్‌లపై అక్రమ కేసులు బనాయించటం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు. నాయకులు రాజమోని అంజి, శివ, వేణుగోపాల్, జంగయ్య, రవి, శేఖర్, వరుణ్‌లు పాల్గొన్నారు.

మంచాల : మండల పరిధి ఆరుట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ 1995 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. కాగజ్‌ఘట్ సమీపంలోని సిరి నేచర్ వ్యాలీలో కార్యక్రమం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత స్నేహితులంతా ఒకేచోట కలిసి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆటాపాటలతో సందడిచేసి సంబరాలు చేసుకున్నారు. అప్పటి అధ్యాపకులు శ్రీనివాస్‌గౌడ్, రంగారావు, నర్సింగ్‌రావు, యాదయ్య, రవికుమార్, సిద్ధిఖీలను శాలువాలు కప్పి సత్కరించారు. విద్యార్థులు ఎండీ.సలాం, వి.తిరుమల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సీహెచ్.శ్రీనివాస్, రజినీకాంత్, ఆనంద్, వరలక్ష్మి, వనజ, శైలజ, శోభ, సుజాత, మమత, శ్రీలత తదితరులు ఉన్నారు.

యాచారం : భూ భారతి చట్టంపై నేడు మండల కేంద్రంలో అవగాహన సదస్సు ఏర్పా టు చేసినట్లు తహసీల్దార్ అయ్యప్ప తెలిపారు. సమావేశానికి కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు పాల్గొంటారని చెప్పారు.

తలకొండపల్లి : చుక్కాపూర్ గ్రామానికిచెందిన ఏమిరెడ్డి పాండు రంగారెడ్డి, ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు ఉదారతను చాటుకున్నారు. చుక్కాపూర్‌కు చెందిన కొప్పు కిష్టమ్మ ఇటీవల మృతిచెందింది. అంత్యక్రియల కోసం అదే రోజు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబ ఇబ్బందుల గూర్చి తెలుసుకున్న పాండు రంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు సోమవారం రూ.25వేలు సమకూర్చి అందజేశారు. అధైర్య పడవద్దు అండగా ఉంటామన్నారు.

సేవలను బట్టే సమాజంలో కీర్తి



జంగమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వం, సేవలను బట్టే సమాజంలో కీర్తి లభిస్తుందని టాస్క్‌సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. మనుషులు జీవిత కాలంలో చేసిన మంచి పనులు మరణానంతరం కూడ ప్రజల్లో కీర్తించబడుతాయన్నారు. ఆమనగల్లు మండలం శంకర్‌కొండ తండాకుచెందిన కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లీ రాములు మాతృమూర్తి, చెంచు సేవా సంఘం నాయకురాలు మండ్లీ జంగమ్మ సంస్మరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వివిధ పార్టీలు, సంఘాల నేతలు, గిరిజనులు, చెంచులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. జంగమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు అనితవిజయ్, యాట నర్సింహ, గుర్రం కేశవులు, మోహన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బీక్యానాయక్, జగన్, జక్కు అనంత రెడ్డి, కల్లు రమణారెడ్డి, దావ ధనుంజయ్య, మిట్టపల్లి అంజయ్య, మానయ్య, కాలే మల్లయ్య, దుర్గయ్య, గోరటి యాదయ్య, బీక్యానాయక్, పత్యానాయక్, ప్రశాంత్ నాయక్, అమర్‌సింగ్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, అంజన్‌రెడ్డి, నర్సింహ్మా, బాల్‌రామ్, రాఘవేందర్, జంగయ్య, వస్పుల శ్రీకాంత్, ఫరీద్, అలీం, సీత పెద్దయ్య, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): 317 జీవో కారణంగా స్థానికతను కోల్పోయిన వారిని తమసొంత జిల్లాలకు బదిలీ చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 317 జీవో బాధితుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి మల్లేశ్‌లు తెలిపారు. స్థానికత కోల్పోయిన దాదాపు 10 వేల మంది బాధితులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం చలో హైదరాబాద్ విజయవంతంపై జేఏసీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి విజయ్ కుమార్, మల్లేశ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చలో హైదరాబాద్ నిరసన కార్యక్రమాన్ని సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. డిమాండ్లను సాదించే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 317 జీవో బాదితులకు న్యాయం చేయాలని విజయ్‌కుమార్, మల్లేశ్ లు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాద్యులు అలివేలు, పవన్, ఆనంద్, జ్ఞానేశ్వర్, రియాజోద్దీన్, మహేశ్, ఆనంద్, పవన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయ్ కుమార్, మల్లేశ్